స్థానిక సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో తెలుగుదేశం నాయకులతో కలిసి 70 రోజులు ఇంటింటికి వెళ్ళి వారి సమస్యలు తెలుసుకోవడానికి వెళ్ళినప్పుడు ప్రతీ గ్రామంలోను కనీస అవసరాలైన త్రాగునీరు లేదని, రోడ్లు లేవని, డ్రైనేజీలు లేవని, పారిశుధ్యం లేదని, వీధి దీపాలు లేవని, స్మశానంలో సరైన సదుపాయాలు లేవని, దోమలు ఎక్కువగా ఉన్నాయని, వైద్య సౌకర్యం కల్పించాలని, పంచాయతీ నిధులు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిపై సరైన దర్యాప్తు జరిపించి, దోషులను శిక్షించాలని, వెంటనే పంచాయతీలకు నిధులు విడుదల చేసి, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జనసేన శ్రేణులు, టీడీపీ శ్రేణులతో కలిసి నిరసన తెలిపి అనంతరం జిల్లా కలెక్టర్ కృతిక శుక్లకు తెలుగుదేశం నాయకులు చప్పిడి వెంకటేశ్వరరావు, విప్పై దాసు, సీతయ్య దొరతో కలిసి వినతిపత్రం అందించారు కాకినాడ రూరల్ జనసేన, టీడీపీల ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి పంతం నానాజీ. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, తెలుగుదేశం నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేటలో శుక్రవారం ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మూడు పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బాలయోగి గురుకులం బాలికల పాఠశాలను, అక్షర కాలేజ్‌ను, ప్రభుత్వ జూనియర్ కళాశాలను సెంటర్స్‌గా నిర్ణయించడంతో ఆయా పరీక్షా కేంద్రాలలో జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొదటి రోజు కావడంతో ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. గురుకులం జూనియర్ కళాశాల విద్యార్థినులను ఆర్టీసీ బస్సులో జూనియర్ కళాశాల, అక్షర కళాశాల సెంటర్స్‌కు చేర్చారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రధాన మంత్రి ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్లను జగ్గంపేట జడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి రఘురామ్ శుక్రవారం వారి స్వగృహంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం క్రింద పంపిణీ చేసే కనెక్షన్లకు ప్రభుత్వం నుండి సబ్సిడీ అందించనున్నట్టు తెలిపారు. ఈ ఉచిత కనెక్షన్లు 82 మందికి అందించినట్టు తెలిపారు. గ్యాస్ సదుపాయం లేని నిరుపేదలు అర్జీ పెట్టుకుంటే వారికి కూడా అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆకుల శ్రీధర్, గొల్లపల్లి శ్రీను, చెరుకూరి జయరాజ్, నీలపల్లి అప్పారావు, జగ్గంపేట మండలం సేవాదళ్ కన్వీనర్ కిలపర్తి వీరబాబు, జగ్గంపేట వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హలో మాదిగ...చలో రావులపాడు

7న మాదిగల రాజకీయ చైతన్య సభ

విశాలాంధ్ర - మండపేట : రాష్ట్రంలోని ఏ రాజకీయ పార్టీ అయినా మాదిగలను ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తూ వాడుకుంటున్నాయే తప్ప మాదిగలకు న్యాయం చేకూర్చడం లేదని ఎమ్మార్పీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ మండిపడ్డారు. ఏడవ వార్డులోని అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్ స్మారక మందిరం వద్ద శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా మాదిగలు ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నారని అన్నారు. పాలించే ప్రభుత్వాలు, వివిధ పార్టీలు మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి తప్ప మాదిగల న్యాయమైన కోరిక ఎస్సీ వర్గీకరణ అంశం పట్ల శ్రద్ధ చూపడం లేదన్నారు. ఈ నెల 7న రావులపాడులో పెద్ద ఎత్తున తలపెట్టిన మాదిగల రాజకీయ చైతన్య సభకు మాదిగలు మాదిగ ఉపకులాలు భారీగా తరలి రావాలని బుంగ సంజయ్ మాదిగ పిలుపు నిచ్చారు. మాదిగల రాజకీయ చైతన్య సభ కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరిం చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ఎస్ నాయకులు డీఎస్ రాజు, ముమ్మిడివరపు త్రిమూర్తులు, ముమ్మిడివరపు సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పాదకరంగాల వైపు ఆలోచనలు చేయాలి

విశాలాంధ్ర - కొత్తపేట : విద్యార్థి దశ నుంచి ఉత్పాదకరంగాల వైపు విద్యార్థులు ఆలోచనలు సాగాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. కమల కుమారి సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ. మధు సూదన్‌రావు పిలుపునిచ్చారు. కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో శుక్రవారం ఈఎండిపి జిల్లా స్థాయి ఎక్స్‌పో నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం గోపాలరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిఈఓ కమలకుమారి, ఏపీసి మధుసూదనరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుందన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా 9వ తరగతి విద్యార్థులకు వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. జిల్లాలో 224 ఉన్నత పాఠశాలలో 13000 మంది 9వ తరగతి విద్యార్థులకు ఈఎండిపి ప్రోగ్రాం అమలవుతుందన్నారు సమగ్ర శిక్ష ఏఎంఓ పి రాంబాబు, ఈఎండిపి జోనల్ మేనేజర్ యనమదల నవ్య, జిల్లా సైన్స్ అధికారి జీవి సత్య సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లా ప్రదర్శనకు పది ప్రాజెక్టులు ఎంపిక అయ్యాయన్నారు. ఈనెల 6వ తేదీన రాష్ట్రస్థాయి ఈఎండిపి ప్రాజెక్టుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. డిసిఇబి సెక్రెటరీ బి. హనుమంతరావు, డైట్ ప్రిన్సిపాల్ కెవి సూర్యనారాయణ, సమగ్ర శిక్ష ఆల్టర్నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్ డి రమేష్ బాబు ఎపిఓ డాక్టర్ ఎంఏకే భీమారావు మాట్లాడుతూ పాఠశాలల్లో అమలయ్యే ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఉపాధ్యాయుల కృషి దాగి ఉందన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జి అగ్రహారం ప్రభుత్వ బాలికలు ఉన్నత పాఠశాల, అమలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్తపేట విద్యార్థుల రూపొందించిన మూడు ప్రాజెక్టులను ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేసి మెమొంటో ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం. హరిప్రసాద్, రావులపాలెం ఎంఈవోలు క్రిస్టోఫర్ శ్రీనివాసరాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3న బాలయోగి ఘాట్‌లో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - అమలాపురం : దివంగత లోకసభ స్పీకర్ కీ.శే. జీఎంసీ బాలయోగి 22వ వర్ధంతి సందర్భంగా మూడవ తేది ఆదివారం తెలుగుదేశం పార్టీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్ బాలయోగి ఆధ్వర్యంలో అమలాపురం బాలయోగి ఘాట్ వద్ద మెగా వైద్య శిబిరం నిర్వహి స్తున్నట్లు హరీష్ కార్యాలయం తెలిపింది. వైద్య శిభిరంలో పరీక్షలు, స్త్రీలకు గర్భాశయ పరీక్ష (పాప్స్మయిర్ టెస్ట్), స్త్రీలకు రొమ్ము పరీక్ష (మామోగ్రఫీ), స్త్రీ, పురుషులకు ఉదర పరీక్ష (అబడామిన్ స్కానింగ్), స్త్రీ పురుషులకు ఊపిరితిత్తుల ఎక్స్రే పరీక్ష. కంటి పరీక్షలు. పళ్ళ పరీక్షలు. చెవి ముక్కు గొంతు పరీక్షలు ఈసీజీ 2డి ఎకో ఇతర ఆరోగ్య సమస్యలు.పదివేల రూపాయలు విలువ చేసే వైద్య పరీక్షలు ఉచితంగా చేయిస్తామని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోగలరని వారు కోరారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎస్సై

విశాలాంధ్ర - ఆలమూరు : మండల కేంద్రమైన ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ఎస్సై శ్రీను నాయక్ తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం పరీక్షల నిర్వహణకు ఏమైన సమస్యలు ఉన్నాయా అని ఉపాధ్యాయులను ఆరా తీశారు. అక్రమాలకు తావులేకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు

విశాలాంధ్ర - కాకినాడ : ఇటీవల కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో ఓఎన్‌జిసి గ్యాస్ వెలికితీత పనుల సందర్భంగా ఏటిమోగ, తదితర గ్రామాల మత్స్యకారులకు నష్ట పరిహారం ఇచ్చి వారిని ఆదుకోవాలని కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ చైర్మన్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ మత్స్యకారులను ఆదుకోవాలని శుక్రవారం కాకినాడలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అందోళన చేయడం అభినందనీయం అన్నారు. మంగళవారం ఇదే అంశం పై సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. రాజకీయాలక తీతంగా ఏపీ ప్రజలు ముఖ్యంగా కాకినాడ ప్రజలు గ్యాస్ పై ఉద్యమిస్తే గుజరాత్ తరహాలో ఇక్కడ కూడా అతి తక్కువ ధరకు కాకినాడ ప్రజలకు ఇంటింటికి గ్యాస్ సరఫరా చేయవచ్చని పెట్రోల్ ధర అందరికి అందుబాటులో వుంటుందని ఆయన అన్నారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి గ్యాస్ పైప్‌లను బ్లాక్ చేయాలని మధు తెలిపారు. దీనిపై హై కోర్ట్‌లో కూడా పిల్ వేస్తున్నామని దీనికి కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ ప్రణాళిక వేస్తుందని అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను అఖిలపక్షం కలుస్తుందని మధు అన్నారు. మార్చి రెండవ వారంలో దీనిపై కాకినాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని మధు అన్నారు.

జగనన్న విద్యా దీవెనతో రూ.28.84 కోట్ల లబ్ధి

కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లాలో 2023-24 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికి జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా మొత్తం 41,474 మంది విద్యార్థులకు రూ. 28.84 కోట్ల మేర లబ్ధి జరుగుతోందని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. 2023-24 మొదటి ఫేజ్‌కి సంబంధించి జగనన్న విద్యా దీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లా పామర్రులో శుక్రవారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జగనన్న విద్యా దీవెన జిల్లాస్థాయి కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి శాసనమండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనసూరి ప్రభాకర్, గాండ్ల, తెలిక కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరు వీరప్రసాద్, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ బిళ్లకుర్తి నాగమణి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులు తదితరులతో పాటు వివిధ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద 2023-24, అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికి కాకినాడ జిల్లాలో 37,136 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం మైనారిటీ, కాపు, క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 28.84 కోట్లు జమవుతున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు.

రాజోలులో భారీ అగ్నిప్రమాదం

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని రాజోలు సెంటర్‌లో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రాజోలు కనకం ఫ్యాన్సీ షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగి భారీగా అగ్నికీలలు ఎగసి పడ్డాయి. ఈ ప్రమాదంలో నాలుగు దుకాణాలు దగ్ధం అయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేసారు. ప్రమాదంలో నాలుగు దుకాణాలు దగ్ధం అవడంతో 30 లక్షల వరకు నష్ట జరిగిందని అధికారులు అంచనా వేసారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని తెలిపారు.

నిబంధనలకు వ్యతిరేకంగా పనులు

పారిశుధ్య కార్మికులకు ఆర్థిక సహాయం కరువు

విశాలాంధ్ర - కాకినాడ : ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి అనుబంధ సంఘం) ఆధ్వర్యంలో కాకినాడలో శుక్రవారం ఉదయం ఎమ్మెస్ ఎన్ స్కూల్స్ సమీపంలో ఉన్న 14వ సర్కిల్లో సుమారు గంటసేపు మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆధ్వర్యంలో చల్లా శేఖర్‌ను ఆదుకోవాలని, తనకు న్యాయం చేయాలని, పనిముట్ల మంజూరు చేయాలని, రాజకీయ ఒత్తిడిలు ఆపాలని, సుమారు గంటసేపు ఆందోళన జరిగింది. ఈ ఆందోళనలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లా డుతూ కాకినాడ కార్పొరేషన్‌లో నిబంధనలకు వ్యతిరేకంగా పనులు పురమాయించడం వల్ల ఆప్కాస్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు చల్లా శేఖర్ కాలుకు యాక్సిడెంట్ అయి ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ఇప్పటికీ చికిత్స పొందుతున్నాడని తెలిపారు. సంఘటన జరిగి 37 రోజులు గడుస్తున్నా కార్పొరేషన్ నుంచి ఒక్క రూపాయి కూడా ఆర్థిక సహాయం అందించలేదన్నారు. చల్లా శేఖర్‌ను ఆదుకొని, కార్పొరేషన్ నుంచి ఆర్థిక సహాయం అందించాలని ప్రసాద్ అన్నారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఓడించండి

విశాలాంధ్ర - బ్యూరో కాకినాడ : ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాల రావు, సర్పంచ్ల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా రాష్ట్ర నాయకులతో కలిసి తూర్పు గోదావరి జిల్లా కాకినాడ సిటీలోని జిల్లా కలెక్టర్ కార్యాల యం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై పదహారు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 2 నెలల్లో జరగబోయే రాష్ట్ర అసెంబ్లీ-పార్లమెంట్ ఎన్నికల్లో స్థానిక సంస్థల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా "ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని, వైయస్సార్సీపి పార్టీని ఓడించడానికి తీవ్రంగా కృషి చేయాలన్నారు. 12,918 గ్రామాలలోని 3 కోట్ల 50 లక్షల మంది గ్రామీణ ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని రాజేంద్రప్రసాద్ అన్నారు. వానపల్లి లక్ష్మీ ముత్యాల రావు మాట్లాడుతూ రెండు నెలల్లో జరగబోయే ఏపీ అసెంబ్లీ-పార్లమెంట్ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని, అధికార వైయస్సార్సీపి ప్రభుత్వాన్ని ఓడించడానికి రాష్ట్రంలోని అన్ని పార్టీలకు చెందిన ముఖ్యంగా అధికార పార్టీ అయిన వైయస్సార్సీపి పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్స్, కార్పొరేటర్స్ తీవ్రంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై వినోద్ రాజు, ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు చుక్క ధనుంజయ్ యాదవ్, తూర్పు గోదావరి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ శాంత కుమారి, రంభాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సిబ్బంది కృషి చేయాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సిబ్బంది స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ జరిగేందుకు కృషి చెయ్యాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో, జె. సీతారామారావు హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే సెక్టోరియల్, రూట్ ఆఫీసర్లకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో సిబ్బంది అంతా తమ తమ పనులను పక్కన పెట్టి ఎన్నికల విధుల్లో పూర్తిగా బాధ్యులు కావాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పర్యటించి, పోలింగ్ సామాగ్రిని అందించేందుకు కేంద్రాల దూరాన్ని గుర్తించి సెక్టార్ అధికారులు నివేదిక అందించాలన్నారు. ఈ సమావేశంలో మాస్టర్ ట్రైనర్స్ జాన్. కెనడీ, సీతారామారావు శ్రీనివాస్, సెక్టోరియల్, రూట్ ఆఫీసర్లు, సిబ్బంది ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ, టీడీపీ సవాళ్లతో అట్టుడికిన 'అనపర్తి'

విశాలాంధ్ర-అనపర్తి : అనపర్తిలో వైసిపి, టిడిపి మధ్య ఎన్నికల రగడ మొదలైంది. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి పై మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అవినీతి ఆరోపణలు చేస్తూ చర్చకు రావాలని సవాల్ చేస్తూ కరపత్రం తో స్వయంగా వెళ్లి ఎమ్మెల్యేకి చెందిన ఆసుపత్రి సిబ్బందికి అందించడంతో వైసిపి,టిడిపి మధ్య అగ్గిరాజుకుంది. మార్చి 1 వ తేదీన మీ ఇంటికి వచ్చి రుజువులతో ఆరోపణలు నిరూపించడానికి సిద్ధమంటూ నల్లమిల్లి సవాల్ విసరడం అగ్నికి ఆజ్యం పోసినట్టుయ్యింది. ఇప్పటికే ఎన్నో అవినీతి ఆరోపణలు చేసిన రామ కృష్ణారెడ్డి పై ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా 1వతేదీ శుక్రవారం ఇరు పార్టీల శ్రేణులు ఢీ అంటే ఢీ అంటూ సిద్ధం కావడంతో అనపర్తి, రామవరం వైసిపి, టిడిపి నేతలు, కార్యకర్తలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ముందుగానే పోలీస్ విభాగం స్పందించి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లిని రామవరంలో తన ఇంటినుండి బైటకి రాకుండా నిరోధించే ప్రయత్నం చేశారు. అనపర్తిలో వైసిపి నేతలు కార్యకర్తలతో ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి ఉండటంతో ఏమి జరుగుతుందో అని పలువురు భయాందోళనలు వ్యక్తం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నల్లమిల్లిని అనపర్తి రాకుండా అడ్డుకోవడంతో కొద్దిసేపు రామవరం లో తీవ్ర ఉత్కంఠ, ఉద్రిక్తత నెలకొంది. చివరకు మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని వేరే ప్రాంతానికి పోలీస్ జీప్‌లో తరలించడం తో సాయంత్రానికి ప్రశాంత వాతావరణం నెలకొంది.

మంత్రి దృష్టికి శెట్టిబలిజ కులం సర్టిఫికెట్ల సమస్య

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఆంధ్రాలోని ప్రధానంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శెట్టిబలిజ కులస్తులకు కులం సర్టిఫికెట్ జారీలో సాంకేతిక లోపాన్ని పరిష్కరించి జాప్యాన్ని నివారించాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ దృష్టికి తీసుకువెళ్లినట్లు టిటిడి ఎస్‌వి బిసి అడ్వైజర్ అడపా దుర్గ తెలిపారు. ఈ సమస్యపై సిఎంఓకు సమాచారం అందిస్తానని కూడా ఆయన తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కారమై శెట్టిబలిజ కులస్తులకు కులం సర్టిఫికెట్లు గ్రామ వార్డు, సచివాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా అందుతాయని అడ్వైజర్ దుర్గ తెలిపారు. శుక్రవారం విశాలాంధ్ర దినపత్రికలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శెట్టిబలిజలు లేరా? కులం సర్టిఫికెట్ల కోసం అగచాట్లు శీర్షికన ప్రచురితమైన వార్తకు దుర్గ స్పందించి సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

సుబ్రహ్మణ్యం సేవలు చిరకాలం గుర్తుంటాయి

విశాలాంధ్ర - మండపేట/రామచంద్రపురం : విధి నిర్వహణలో విశిష్ట సేవలందించి నీతి నిజాయితీతో పనిచేసిన ప్రతి ఉద్యోగిని ప్రజలు ఎప్పుడు గుర్తుంచుకుంటారు. అందుకు ఉదాహరణ రామచంద్రపురం సబ్ పోస్ట్ మాస్టర్ పసలపూడి వెంకట సుబ్రహ్మణ్యంను పేర్కొనవచ్చు. పోస్టల్ శాఖలో వివిధ దశల్లో నాలుగు దశాబ్దాలుగా విశిష్ట సేవలు అందించిన రామచంద్రపురం ఓల్డ్ టౌన్ సబ్ మాస్టర్ పసలపూడి వెంకటసుబ్రహ్మణ్యం పదవీ విరమణ సందర్భంగా సన్మానించి సత్కరించారు. రామచంద్రపురం డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ హాల్‌లో జరిగిన పదవి విరమణ సభకు ఇంచార్జ్ ఎస్‌పీఎం, వీ కృష్ణమోహనరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రామచంద్రపురం సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్ స్పెక్టర్ ఎం.లక్ష్మణ్ కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అంకితభావంతో ఎస్‌పీ ఎం. వెంకటసుబ్రహ్మణ్యం పోస్టల్ శాఖలో సేవలు అందించడం ఇతర ఉద్యోగులకు ఆదర్శం కాగలరని తెలిపారు. ఈ సభలో పెన్షనర్స్ ఉద్యోగుల సంఘం డివిజనల్ కార్యదర్శి ఎస్.రామలింగేశ్వరరావు, టి. పుల్లేశ్వరరావు, టి. రఫాయల్, కెవి నాగమోహన్ రావు, ఎల్‌విఎన్ బాబు, పోస్ట్ మాస్టర్ కే విఠల్ నాథ్, ఉద్యోగుల కార్యదర్శి జి. రమణమూర్తి, టి. శ్రీనివాస్, బి. సీత, పి. గణేష్ కుమార్ తదితరులు ప్రసంగించారు. అనంతరం పదవీవిరమణ చేసిన పీవీ సుబ్రహ్మణ్యం దంపతులను తపాలా ఉద్యోగులంతా ఘనంగా సత్కరించారు. సభను గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వై.స్వర్జన్ రాజు నిర్వహించారు. పదవీ విరమణ సన్మాన సభకు రామచంద్రపురం, మండపేట, రాజమండ్రి, ద్రాక్షారామం, రాయవరం, చెల్లూరు, అనపర్తి, కుతుకులూరు తదితర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజికి పెను ప్రమాదం

విశాలాంధ్ర - అమలాపురం : ఉభయ గోదావరి జిల్లాల్లో సాగుభూమిని సస్యశ్యామలం చేస్తున్న వరదాయిని కాటన్ బ్యారేజి ప్రమాదంలో పడిందా అని సీపీఐ నాయకులు కె . సత్తి బాబు తీవ్ర ఆశ్చర్యానికి గురయ్యారు. బ్యారేజికి అతి సమీపంలో ఇసుక దోపిడీ విచ్చలవిడిగా సాగుతోందని వార్తలు వస్తున్నా యని సత్తి బాబు పేర్కొన్నారు. నిబంధనలకు పాతరేసి డ్రెడ్జింగ్ చేస్తూ ఇసుక సంపద కొల్లగొట్టడంలో ఆన కట్టకు ముప్పు ఏర్పడిందని కానీ ఈ దోపిడిని అరికట్టాల్సిన శాఖలు ఇరిగేషన్, మైన్స్, రెవెన్యూ అధికారులు కళ్లకు గంతలు కట్టు కొని మసులుతున్నారని, అధికారుల అండతో ఇసుక దోపిడీ దారులు మరింత రెచ్చిపోయి దోపిడీ యథేచ్ఛగా చేస్తున్నారని అన్నారు.

PUBLICATION
IN THE COURT OF THE HON'BLE II ADDL DIST COURT : Dr. B. R. AMBEDKAR KONASEEMA DIST: AMALAPURAM
EP No.1308 of 2019 In AC No: 1033 of 2012
Between:
Shriram Transport Finance Co., Ltd. Amalapuram Branch, rep by its GPA holder **B.Srinivas Reddy** ...DHr.
Vs
K.Venkata Naga Prasad & another ...JDrs
JDr No.1: Kamuju Venkata Naga Prasad, S/o.Gangadhara Rao, D.No:3-2, Siripalli, Ainavilli (M), Amalapuram-533211
The above named D Hr company has instituted the above EP 1308/2019 against you, and the same stands posted to **01-04-2024** at **10.30 AM** for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.
//by the orders of the Hon'ble court//
V.R. Vidya Sankaram
Amalapuram Advocate, Amalapuram
Dt.01-03-2024 98492 93793

కొవ్వూరులో దిగజారుతున్న శాంతి భద్రతలు

విశాలాంధ్ర-కొవ్వూరు: కొవ్వూరులో శాంతిభద్రతలు నానాటికి దిగజారుతున్నాయి. హోం మంత్రి తానేటి వనిత ఉన్నంతసేపు కొంతమేర లా అండ్ ఆర్డర్ కంట్రోల్‌లో ఉంది. ఆమె గోపాలపురం బదిలీ కావడంతో ఇక్కడ షరా మాములుగా తయారైంది. ప్రస్తుతం కొవ్వూరులో రౌడీలు బ్లేడ్ బ్యాచులు రెచ్చిపోతున్నాయి ఇప్పటివరకు రాజమండ్రిలోనే ఈ బ్యాచ్లు ఉన్నాయనుకుంటే కొవ్వూరు ప్రజానీకానికి ఇప్పుడు జరుగుతున్న విషయం మింగుడు పడడం లేదు. ఇటీవల కొవ్వూరు సిఐగా బాధ్యతలు చేపట్టిన జగదీష్ కుమార్ రాజమండ్రి నుంచి వచ్చిన నూతన ఎస్సై సత్యనారాయణ కొంతమేర రౌడీయిజాన్ని కంట్రోల్ చేస్తున్నారు. ముఖ్యంగా బస్టాండ్ సెంటర్లో బ్రాందీ షాపు ఉండటం దాని పక్కనే తాగుతూ మందుబాబులు వీరంగం చేస్తున్నారు. ఈ విషయం కూడా పట్టణ పోలీసులు కంట్రోల్ చేశారు కానీ పెట్రోల్ బంకులు ఎదురుగా ఉన్న బ్రాందీ షాపుల వద్ద కిల్లీ షాపుల వద్ద వున్న వర్తకులు తమ షాపుల వద్ద టేబుల్, కుర్చీలు సైతం ఏర్పాటు చేసి తాగడానికి అనుమతిస్తూ వారి వ్యాపారానికి అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్టాండ్ సెంటర్లో తాగుబోతులను కంట్రోల్ చేసిన పోలీసులు పెట్రోల్ బంక్ ఎదురుగుండా ఉన్న కిల్లీ షాపులను వదిలేయడంతో అక్కడ తాగుబోతులు రెచ్చిపోతున్నారు. శుక్రవారం సాయంత్రం బస్టాండ్లో కిల్లీ షాపు ఎదురుగా విద్యార్థులు ప్రేమ కోసం కొట్టుకోవడం చర్చనీయాంశమైంది. తీరా ఆరా తీస్తే వారు విద్యార్థులు కాదు బయట వ్యక్తులని తెలిసింది. బస్టాండ్‌లో మూడు షిఫ్ట్‌లలో కానిస్టేబుల్‌ను నియమించాలని దీంతో శాంతి భద్రతలు అదుపులోకి వస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

సైన్స్‌తోనే దేశ భవిష్యత్తు

విశాలాంధ్ర - నిడదవోలు : సైన్సు అభివృద్ధితోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, మారుతున్న సాంకేతికతను యువత అంది పుచ్చుకున్నపుడే వారి భవితకు బంగారు బాట వేసుకున్నట్లు అవుతుందని నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. నిడదవోలు రోటరీ క్లబ్ అధ్యక్షులు కీర్తీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్యూపిల్స్ ట్రీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ గోపవరంలో నేషనల్ సైన్స్ డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించిన ఆదినారాయణ మాట్లాడుతూ నోబెల్ గ్రహీత సర్ సి.వి.రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొనిన రోజు ఫిబ్రవరి28ని జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన సైన్స్ మోడల్స్‌తో ఏర్పాటుచేసిన సైన్స్ ఫేర్‌ను తిలకించి విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు మాట్లాడుతూ మన దేశ పతాకాన్ని రెపరెప లాడించిన సర్ సీ.వి. రామన్ ఫిబ్రవరి 28, 1987వ సంవత్సరంలో కాంతి పరివర్తనను వైజ్ఞానికంగా నిరూపించినందుకు ఆయన నోబెల్ బహుమతి అందుకున్నారన్నారు. పాఠశాల వ్యవస్థాపకులు, ప్రిన్సిపాల్ ఉప్పులూరి నరేష్ భూపతి ఆది నారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి శివకుమార్, కాళ్ళ రాంబాబు, పొన్నా సుబ్రహ్మణ్యం, గోన్నాబత్తుల రామారావు,అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, గోపిరెడ్డి శ్రీనివాస్,కొత్తపల్లి నాగేశ్వరరావు ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులకు భద్రత ఏది?

విశాలాంధ్ర - సీతానగరం: కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులకు భద్రత ఏది? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో రాజమహేంద్రవరం నుండి పురుషోత్తపట్నం వైపు శుక్రవారం ప్రయాణం చేస్తున్న ఆర్‌టీసి బస్సు రామచంద్రపురం ఏటిగట్టు రోడ్డు పై అదుపు తప్పగా గట్టు పై అడ్డంగా తిరిగి తృటిలో కిందకు జారకుండా పెద్ద ప్రమాదం తప్పింది. అదే సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. కాలం చెల్లిన బస్సులను తిప్పుతూ ప్రయాణికుల ప్రాణాలతో అర్ టీ సి చెలగాటం ఆడుతున్నదని ప్రజలు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రయివేటు వాహనాల కేనా ప్రభుత్వ సంస్థ అయిన అర్‌టీసి బస్సులకు నిబంధనలు వర్తించవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు, నాయకులు స్పందించి ప్రయాణికుల భద్రత దృష్ట్యా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - దేవరపల్లి: అన్ని వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దేనని హోం శాఖ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. దేవరపల్లి మండలం లక్ష్మీపురంలో నాయకులు, కార్యకర్తల ప్రత్యేక కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి దేనని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ఆర్.బి.కెలు ఏర్పాటు చేశామని తెలిపారు. దళారీ వ్యవస్థ లేకుండా ఆర్ బి కే ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతకుముందు లక్ష్మీపురంలోని హరిహర క్షేత్రాన్ని ఆమె సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసి చైర్మన్ జి. జనార్ధన రావు. సర్పంచ్ దోనెల్లి ధనలక్ష్మి. మాజీ సర్పంచ్ దోమిల్లి జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించండి

విశాలాంధ్ర-గోకవరం : గోకవరం మండలంలోని పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు పిలుపునిచ్చారు. గోకవరం గ్రామపంచాయతీ కార్యా లయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోకవరం మండలంలో 41 బూతులలో 0 సున్నా నుండి 5 సం. వయసుగల 6412 మంది పిల్లలకు 174 మంది వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఈనెల మూడో తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి తల్లులందరూ పాల్గొని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని, పల్స్ పోలియో పోస్టర్లను ఎంపీపీ ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమరం శ్రావణి, సొసైటీ చైర్ పర్సన్ దాసరి చిన్నబాబు, పంచాయతీ సెక్రెటరీ టంకాల శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర -నల్లజర్ల : నల్లజర్ల మండలంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉద్యోగంలో చేరవలసిన కుమారుడు ఉరి వేసుకుని చనిపోవడంతో కుటుంబం తల్లడిల్లుతోంది. నవీపేట గ్రామంలో తాడిమల్ల వెంకటేశ్వరరావుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు తాడిమల్ల సాయి ఉన్నారు. బిటెక్ చదివిన సాయికి ఇటీవల బెంగళూరులో ఉద్యోగం వచ్చింది. శుక్రవారం రాత్రి బెంగళూరు వెళ్ళవలసి ఉంది. శనివారం ఉద్యోగంలో చేరాల్సి ఉండగా ఏ కష్టం వచ్చిందో ఏమో తెలియదు. ఎర్రకాలువ అవతల ఉన్న జీడి మామిడి తోటలోకి తన తల్లి చీర తీసుకెళ్లి జీడి మామిడి చెట్టుకు ఉరివేసుకున్నాడు. చనిపోయేముందు స్నేహితులకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి ఉరి వేసుకున్నాడు. చనిపోవడానికి కారణాలు తెలియాల్సి ఉంది.

డీఎన్నార్‌లో ప్రపంచ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర -భీమవరం: మహిళ అబల కాదని సబలని , స్త్రీ శక్తి మహా శక్తి అని, సృష్టికి ప్రతి సృష్టి మహిళ అని డిఎన్నార్ విద్యా సంస్థల ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో ఇన్నర్ వీల్ క్లబ్, సౌందర్య బ్యూటీ క్లినిక్, పట్టణ కళాకారుల సౌజన్యంతో డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల వేడుకలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను గౌరవించే ప్రాంతాలు అభివృద్ధి పథంలో ఉంటాయని, నేడు రాష్ట్రపతి స్థాయికి మహిళాలు వెళ్ళినా అరాచకాలు, అత్యాచారాలు ఆగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంజన్ కుమార్, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యురాలు సామంత మణి మాట్లాడుతూ పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారని, మూడున్నర దశాబ్దాలుగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పవిత్రమైన మహిళలకు ప్రపంచమే ఒక దినోత్సవంగా కల్పించిందంటే మహిళకు మంచి గౌరవం ఉందని, అందరూ మహిళలను గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో ఎండి సరోజినీ, శ్రీదేవీ, డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల గ్రంధాల యాధికారి కె.శిరీష, ఏ.హర్షిత, బి.సుష్మా, కే.శ్రీవల్లి, టీ.తేజశ్రీ, పి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

జబర్దస్త్ సినీ కళాకారుల బృందానికి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో బిజెపి నేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి తరుపున కమల రథం పేరుతో జబర్దస్త్ కళాకారులు, సినీ గాయని, గాయకులతో కూడిన బృందం 25 రోజులలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి 100కు పైగా ప్రదర్శనలు నిర్వహించి ప్రచారం చేయడం ద్వారా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించారు. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు గురువారం ఏలూరులోని సుంకరి వారి తోట లో జరిగిన 102వ ప్రదర్శనను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు చేసినట్లు సంస్థ ప్రతినిధి సుప్రీంకోర్టు న్యాయవాది వరప్రసాద్ అధికారికంగా ప్రకటించారు . ఈ సందర్భంగా కమల రథం ప్రచార బృందాన్ని ముందుండి నడిపించిన ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, ఇమ్మానియేల్, అప్పారావు, వినోద్, బాబి, సినీ గాయని, గాయకులు లాస్య ప్రియ, అరుణ్ కౌండిన్య బృందం సభ్యులకు అవార్డును, మెడల్స్ ను ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దూకుడు సినిమా ఫేమ్ రమణ, రఘు, బిజెపి నాయకులు గాది రాంబాబు, నాగం శివ, వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌కు విస్తృతంగా ప్రచారం కల్పించాలి

విశాలాంధ్ర-చింతలపూడి: తేదేపా మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని టిడిపి, జనసేన చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ అన్నారు.టిడిపి కార్యాలయంలో సూపర్ 6 పథకాల పోస్టర్ ను సొంగా రోషన్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సొంగా రోషన్ మాట్లాడుతూ చంద్రబాబు , పవన్ కళ్యాణ్ ప్రవేశపెట్టిన నిరుద్యోగులకు రూ.3వేల భృతి, స్కూల్ కి వెళ్లే ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది విద్యార్థులకు ఏడాదికి రూ. 15వేలు, ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేల ఆర్థిక సహాయం, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు 1500,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే బృహత్తర కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలకు తీసుకువెళ్లాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.అనంతరం నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి సూపర్ సిక్స్ పథకాల కిట్‌ను బూత్ ఇన్‌చార్జిలకు,క్లస్టర్ కన్వీనర్లకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాటూరి వెంకట్రామయ్య,లింగపాలెం మండల అధ్యక్షులు గరిమళ్ళ చలపతిరావు, నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వర రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవా, ఐటీడీపీ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్,ఎస్ సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పల్లి శ్రీను,మాజీ ఎంపీటీసీ కనుమతరెడ్డి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే గుడ్ మార్నింగ్

విశాలాంధ్ర - కైకలూరు : ప్రజా సమస్యలను తెలుసు కుందాం అనే విధంగా నిత్యం ప్రజల్లో తిరుగుతున్న కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు కైకలూరులో నూతన ఒరవడి ని ప్రజలకు పరిచయం చెయ్యాలని ప్రజా క్షేత్రంలో లో పాల్గొంటున్నారు.శుక్రవారం కైకలూరు-5 సచివాలయ పరిధిలో గుడ్ మార్నింగ్ కార్యక్రమం ద్వారా నాయకులతో కలసి పాల్గొన్నారు.ఈ సందర్భముగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రజలకు శుభోదయం పలుకుతూ క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ఎటువంటి అవినీతికి తావు లేకుండా ప్రజాపాలన చేస్తున్నాం అన్నారు. ఇంకా ప్రజలకు సమస్యలు పరిష్కారం చెయ్యాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు.ఈ కార్య క్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్,జడ్పీటీసీ కురేళ్ళ బేబీ, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి,వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ హమీద్,మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్లు జంపన కొండరాజు, షేక్ రఫీ,పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, పల్లివాడ పిఏసిఎస్ అధ్యక్షులు గంగుల అశోక్,నిమ్మల సాయి, వైసీపీ సీనియర్ నాయకులు దండే రవి ప్రకాష్, కన్నా రమేష్,తులసి పూర్ణ, సుంకర శివ,నిమ్మల శ్రీనివాసు,అసాని ఖాన్, సాన శ్రీనివాసరావు,సమయం ఆంజనేయులు, చావలిపాడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర - గణపవరం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు సజావుగా ప్రశాంతంగా జరిగినట్లు గణపవరం శ్రీ చింతలపాటి బాపి రాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉప్పలపాటి రామచంద్ర రాజు శుక్రవారం తెలిపారు. ఈరోజు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలలో తెలుగు 56 మంది విద్యార్థులకు ముగ్గురు గైర్హాజర్ 53 మంది పరీక్షలు రాశారని, హిందీలో 19 మందికి ఒకరు గైర్హాజర్ 18 మంది రాశారని, సాంస్క్రిట్ 133 మందికి 133 రాశారని, ఒకేషనల్ 24 మందికి ఇద్దరు గైర్హాజర్ 22 మంది రాయడం జరిగిందని మొత్తం 232 మందికి విద్యార్థులకు గాను ఆరుగురు ఆబ్సెంట్ 226 మంది పరీక్షలు రాసినట్టు తెలిపారు.

తూర్పుతాళ్ళులో తాటాకిల్లు దగ్ధం

విశాలాంధ్ర-నరసాపురం: మండలంలోని తూర్పుతాళ్ళు గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగింది. తూర్పుతాళ్ళు సైపు వారి మెరకకు చెందిన ఆకుల సత్యనారాయణ తాటాకిల్లు శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది. అగ్నిమాపక అధికారి కే. భాస్కరరామం పర్యవేక్షణలో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగనప్పటికి బాధితులు సర్వం కోల్పోయారు. భార్యతోపాటు తాను ఈ తాటాకింట్లో నివాసం ఉంటున్నానని, తన ముగ్గురు కుమార్తెలు వివాహాలు అయిపోవడంతో దూర ప్రాంతాల్లో ఉంటారని సత్యనారాయణ తెలిపారు. తన ఇల్లు కళ్ళ ముందు కాలిపోతున్నా ఏమి చేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-టి నరసాపురం : మర్రిగూడెం గ్రామంలో కురసం వెంకటేశ్వరరావు తాటాకిల్లు గురువారం షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా దగ్ధం కావడంతో నిరాశ్రయులైన బాధిత కుటుంబాన్ని జడ్పీటీసీ సభ్యులు సామంత పూడి బాల సూర్యనారాయణ రాజు శుక్రవారం పరామర్శించి 5వేలు ఆర్థిక సహాయం తో పాటు ఇంటి సామగ్రి వంట పాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దారబోయిన లక్ష్మి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సోయం బిందు, వైసిపి ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కురసం నిరీక్షణరావు, వార్డు మెంబర్ లు అధికారులు పాల్గొన్నారు.

మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు

విశాలాంధ్ర-నరసాపురం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ సంస్కృతం, తెలుగు పరీక్షలు జరిగాయి. నర్సాపురంలో ఆదిత్య, శ్రీవైఎన్ డైమండ్ జూబ్లీ, శ్రీసూర్య , ఉమెన్స్, గౌతమి, భాస్కర కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 8గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష వ్రాసే వాళ్ళు ఎలాంటి సెల్ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలలోనికి తీసుకెళ్లకుండా క్షణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ప్రతిరోజు పరీక్ష పూర్తయ్యేవరకు సిబ్బంది అందరు అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ పరీక్షలలో మస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తుందని ఎంపీడీవో కే మంగతాయారు అన్నారు. శుక్రవారం దర్భ గూడెం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో వాలంటీర్లు ఇంటింటికి తిరిగి ఆరోగ్య వివరాలను సేకరించడం జరిగిందని తెలిపారు. ఈ సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు .ప్రతి ఒక్కరు ఈ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సుమారు 412 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సున్నం ఉషారాణి, వైద్యులు గాయత్రి , ఎస్ కె సుల్తాన్, దీప్తి, పంచాయతీ కార్యదర్శి జే సుబ్రమణ్యం, సిహెచ్ఓ శ్రీనివాసరాజు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

అమరుల త్యాగం మరువలేనిది

విశాలాంధ్ర - లింగపాలెం : ఎంఆర్‌పిఎస్ రిజర్వేషన్ పోరాటంలో అమరులైన వారికి ధర్మాజీగూడెంలో జరిగిన కార్యక్రమంలో నివాళు లర్పించారు. మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. రిజర్వేషన్ల కోసం జరిగిన పోరాటంలో ఇప్పటివరకు అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, వీరి త్యాగం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తనగాల శేఖర్‌బాబు, ముళ్ళపూడి సుమన్, సొంగా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెంలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలలో మొదటి రోజు ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి. ఈ గ్రామంలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయటంతో ఇక్కడ చదివే విద్యార్థులకు ఇబ్బందులు తప్పాయి. పరీక్షా కేంద్రాలను సమీపంలో ఏర్పాటు చేయటంతో విద్యార్థులు అవస్థలు పడకుండా ఉల్లాసంగా పరీక్షా కేంద్రాలకు వచ్చారు. స్థానిక ప్రభుత్వ, ప్రతిభ జూనియర్ కాలేజీల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 303 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 263 మంది పరీలు రాశారు. 40 మంది హాజరుకాలేదు. కేంద్రాలను ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ప్రభాకరరావు తనిఖీ చేశారు. కేంద్రాలలో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పొదుపు చేయడం విద్యార్థి దశ నుండే నేర్చుకోవాలి

విశాలాంధ్ర-మండవల్లి: భవిష్యత్తు ఆర్థికంగా స్థిరంగా ఉండేందుకు విద్యార్థి దశ నుండే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ బొంతు దుర్గారావు, ప్ర.ప.ఐక్యవే జిల్లా కన్వీనర్ ఎల్.ఎస్.భాస్కరరావు,వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ జి.రాజశ్రీ,సి.ఎఫ్.ఎల్ కౌన్సిలర్ పి.రాధ, దుర్గాప్రసాద్ అన్నారు. మండవల్లి మండలం లోకు మూడి గరువు వికాస్ డిగ్రీ కాలేజీలో సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీపై,ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మండవల్లివారి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ టీవీ వెంకటే శ్వర రావు అధ్యక్షతన ఆర్థిక అక్షరాస్యత పై శుక్రవారం అవగాహన,చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మీ భవిష్యత్తు ఆర్థికంగా స్థిరంగా ఉండేందుకు పొదుపు ఒక మంచి మార్గం అన్నారు. కష్ట సమయంలో ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు రాధా, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో భాగంగా మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి మండలాల్లోని రైతులు,చిన్న వ్యాపారులు కళాశాల విద్యార్థులు,సహాయక బృందాలు,సీనియర్ సిటిజన్లలో మంచి ఆర్థిక పద్ధతులు డిజిటల్ వినియోగదారుల రక్షణ గురించి అవగాహన పెంపొందించే కార్యక్ర మాలు నిర్వహించనున్నట్లు తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో బిసి సిహెచ్ వెంకట కళ్యాణి, సిసి ఎం. మాధవి డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర-వీరవాసరం: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వల్ల మాత్రమే సాధ్యమని, 2019 ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూడా అమలు చేయడంతో పాటు ఎన్నికలలో ఇవ్వని హామీలను కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేశారని, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలంలో సుమారు రెండు కోట్ల 48 లక్షల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా తోలేరు గ్రామంలో 19 లక్షల 20 వేల నిధులతో నిర్మించిన వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, 23 లక్షల 94 నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. 41 లక్షల 70 వేల నిధులతో నిర్మించనున్న మంచినీటి పైపులైన్ ఏర్పాటుకు, 18 లక్షలతో నిర్మించే సిసి డ్రైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అండలూరు గ్రామంలో 43 లక్షల 60 వేల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, 15 లక్షలతో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని ఆయన ప్రారంభించారు. నౌడూరు గ్రామంలో 17 లక్షలతో నిర్మించిన విహో భవనాన్ని, 8 లక్షల 20 వేలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. తదనంతరం కొణితివాడ గ్రామంలో 34 లక్షల 20 వేల నిధులతో నిర్మించనున్న మంచినీటి సరఫరా పథకానికి ఆయన శంకుస్థాపన చేశారు.

ఉపాధి హామీ సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర- ముసునూరు: ఉపాధి హామీ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ముసునూరు మండల ఎంపిడిఒ చాగంటి పద్మావతిదేవి అన్నారు.శుక్రవారం మండలంలోని ముసునూరు గ్రామంలో ఫీడర్ ఛానల్ లో జరుగుతున్న పనులను ఏపిఒ టి.రోజలీలా తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీహామి పథకం పనిలోకి వచ్చేవారు తప్పని సరిగా వందరోజుల పని దినాలు పూర్తి చేసుకోవాలన్నారు.

పెద్దేవంలో గడప గడపకు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ప్రభుత్వం పేద ప్రజలకు అందించిన సంక్షేమం ప్రజలకు చేరిన విధానాన్ని తెలుసుకునేందుకు, ఇంకా ప్రజలు కున్న అవసరాలను గుర్తించేందుకు ఎమ్మెల్యేను గ్రామాల్లో తిరగాలి అని ముఖ్యమంత్రి అదేశించారని, దీనిలో భాగమే గడప గడపకు మన ప్రభుత్వం అని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దీనిలో భాగంగానే తాళ్ళపూడి మండలం లో మిగిలిపోయిన పెద్దేవం గ్రామం లో గడప గడప కు శ్రీకారం చుట్టానని తలారి తెలిపారు. పెద్దేవం లో వైకాపా నాయకులు, ఉప సర్పంచ్ తోట రామ కృష్ణ గృహం నుండి గడప గడప ప్రారంభించారు. ఇంటి ఇంటికి వెళ్లి ఆ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ వారి క్షేమాన్ని ఆరా తీస్తూ ఎమ్మెల్యే తలారి గడప గడప కొనసాగించారు. పెద్దేవం వచ్చిన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తలారి కి రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి డా. గూడూరి కి గ్రామం లోని నాయకులని తోట పరిచయం చేసారు. వైస్ ఏ.ఎం.సి కొలిశెట్టి నాగేశ్వరరావు, ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు, సర్పంచ్ తీగిరిపల్లి వెంకట్రావు, వైకాపా నాయకులు కవల నాగేశ్వర రావు, బట్టు సుబ్బారావు, మండల వైకాపా అధ్యక్షులు కాకర్ల వెంకటేస్వరరావు, పలువురు వార్డు మెంబెర్లు, పంచాయతీ సెక్రటరీ సువర్చల, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

విశాలాంధ్ర - జగ్గంపేట : గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన బొడ్డు స్వామి దేవి దంపతుల కుమార్తె తాన్విక ఆసుపత్రి ఖర్చులకు 90 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం మాజీ మంత్రి, జగ్గంపేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోట నరసింహం అందజేశారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చలగళ్ళ దొరబాబు, నీలాద్రిరావు పేట సర్పంచ్ సురేష్ బాబు అధ్వర్యంలో ఈ చెక్కును తాన్విక తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి ఎంపిటిసి మద్దిపట్ల రామకృష్ణ, రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, అత్తులూరి సాయిబాబు, వైసిపి నాయకులు మట్ట బాపిరాజు, నక్క వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఆహార పదార్థాలు అందజేత

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం గొల్లగూడెంలోని లగడపాటి రామలక్ష్మమ్మ వృద్ధాశ్రమానికి భాష్యం స్కూల్ చైర్మన్ భాష్యం రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా నిత్యవసర వస్తువులు పండ్లు ఆహార పదార్థాలు అందజేశారు. ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు నిత్యవసర వస్తువులు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం నిర్వాహకుడు కాగిత భాస్కరరావు మాట్లాడుతూ వృద్ధులకు, వికలాంగులకు ఆహార పదార్థాలు నిత్యావసర వస్తువులు అందించిన రామకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు, ప్రిన్సిపాల్ దాల్ షేక్ షబానా ఉపాధ్యాయులు ఎ. శేషకుమారి, ఎస్. మంజుల, ఎం. అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలంలోని పెనికేరు, చొప్పెల్ల గ్రామాలలో శుక్రవారం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఆయా గ్రామ సర్పంచులు వనుం చిన్నావతి జార్జి బాబు, దంగేటి చంద్రకళ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. పెనికేరు గ్రామంలో అంబేద్కర్ కాలనీలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చొరవతో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు ద్వారా 18 లక్షలు మంజూరు చేయించగా చొప్పెల్ల గ్రామంలో నాగిరెడ్డి నగర్‌లో గవర్నమెంట్ హాస్పిటల్ వెనుక వీధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు ప్రారంభించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెయింటింగ్ వర్కర్లను అన్ని విధాల ఆదుకుంటాం

విశాలాంధ్ర - పెద్దాపురం : పట్టణ పెయింటింగ్ వర్కర్లను అన్ని విధాల ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ పెయింటింగ్ వర్కర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్ దొరబాబు మాట్లాడుతూ పెయింటింగ్ వర్కర్లకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నా వంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ అందిస్తానని దొరబాబు అన్నారు. పెయింటింగ్ వర్కర్స్ అభ్యర్థన మేరకు యూనియన్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విడదాసరి రాజా, త్సలికి సత్యభాస్కర్, కో-ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ. పార్టీ నాయకులు తాడి రాజశేఖర్, నాగబోయిన రాజుబాబు తదితరులున్నారు.

వైసీపీ పాలనలో సంక్షేమం

విశాలాంధ్ర- చాట్రాయి : నిరుపేదల జీవితాల్లో నిరంతరం ఆర్థిక వెలుగులు నింపుతున్న చారిత్రాత్మకమైన సంక్షేమ పాలన వైసీపీ ప్రభుత్వంలోనే సాధ్యమని చాట్రాయి గ్రామపంచాయతీ సర్పంచ్ దామెర ఉషా ప్రసాద్ కొనియాడారు. శుక్రవారం మండల కేంద్రం చాట్రాయి గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి తిరుగుతూ పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాట్రాయి గ్రామంలో జగన్ పాలనలో 250 కొత్త పెన్షన్లు మంజూరు చేశామని అన్నారు. గ్రామంలో 690 పెన్షన్‌లు 20 లక్షల 91 వేల రూపాయలు ప్రతినెల పంపిణీ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు దామెర ప్రసాద్ బాబు, చాట్రాయి ఎంపీటీసీ సంకు శివకుమారి, సత్యనారాయణ, వెంకట్రావు, పాములపాటి ప్రసాద్ రెడ్డి, కుప్పిరెడ్డి వసంతం తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

విశాలాంధ్ర - కరప : పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస నాయక్ పేర్కొన్నారు. కరప పీహెచ్సీ పరిధిలో ఈనెల మూడవ తేదీ ఆదివారం 28 బూత్లలో 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించాలని డాక్టర్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. వేలంగి పిహెచ్సీ పరిధిలో 20 బూత్లు ఈ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రూట్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, ఎంఎల్ హెచ్పీలు, ఏఎన్ఎమ్, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొంటారని నాయక్ తెలిపారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల అమల్లో నిర్లక్షం తగదు

విశాలాంధ్ర - రాజానగరం : సార్వత్రిక ఎన్నికలల్లో భాగంగా కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల అమల్లో నిర్లక్షం తగదని, ఖచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవిలత అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత,జిల్లా ఎస్పీ పి. జగదీష్ కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల బ్యాలెట్ యూనిట్స్(బాక్స్) భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రీ రూరల్,అర్బన్, రాజానగరం, కొవ్వూరు, అనపర్తి ఆర్వోలు ఎన్.తేజ్ భరత్,కె.దినేష్ కుమార్,ఏ.చైత్ర వర్షిణి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బ్యాగుల నిర్మూలనకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ పిలుపు

విశాలాంధ్ర - కాకినాడ : రోజువారీ వాడకంలో ప్లాస్టిక్ బ్యాగులు, కవర్ల నిర్మూలనకు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ కాకినాడ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చింది. అందుకోసం తమ వంతు జిల్లా వ్యాప్తంగా జూట్ బ్యాగుల పంపిణీని ప్రారంభించింది. జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జూట్ బ్యాగులను ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం పంపిణీ చేశారు. బ్యాగులను అందజేస్తూ ప్లాస్టిక్ బ్యాగుల వల్ల కలిగే అనర్థాలను వివరించడంతో పాటు వాటికి ప్రత్యామ్నాయ వినియోగ వస్తువుల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో ప్లాస్టిక్ బ్యాగులు, కవర్ల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునివ్వాలని ప్రముఖ సామాజికవేత్త సానా సతీష్ బాబు సంకల్పించారన్నారు.

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ ఎ++ గుర్తింపు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య క్యాంపస్ నందు గల ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల అటానమస్‌కు ఎన్ఎఎసి ఎ(నాక్ - ఎ ++) గుర్తింపు లభించినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేసారు. నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ వారు కళాశాలలో గల ల్యాబ్, లైబ్రరీ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది మరియు మౌలిక సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించిన త్రిసభ్య బృందం సిఫారసు మేరకు తమ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు 3.51 స్కోర్‌తో "నాక్ ఎ++" గుర్తింపు లభించినట్లు సతీష్ రెడ్డి తెలిపారు. భారతదేశంలోని విద్యా సంస్థల, యూనివర్సిటీల యొక్క క్వాలిటీ స్టేటస్, కరిక్యులం, టీచింగ్, లెర్నింగ్, ప్రాసెస్, ఫ్యాకల్టీ రీసర్చ్ కళాశాల మౌలిక వసతుల ఆర్థిక వనరులు తదితర అంశాలకు ప్రాధాన్యత క్రమంలో ప్రమాణాలుగా తీసుకొని ఈ గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డా ఎమ్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్‌లు డాక్టర్ పిఎస్‌వివిఎస్ రవి కుమార్, డాక్టర్ జి. రామకృష్ణ, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ వాయిదా

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం మార్చి 9 వ తేదీన జరగవలసిన జాతీయ లోక్ అదాలత్ ను మార్చి 16 వ తేదీన (3వ శనివారం) నిర్వహించ నున్నట్లు తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి. కె. ప్రత్యూష కుమారి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని న్యాయస్థానాలలో అన్ని రకాల సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ నందు పరిష్కరించు కోగలరని అన్నారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి మార్చి 16 వ తేదీ 3 వ శనివారం రోజున జరుగు జాతీయ లోక్ అదాలత్ నందు వారి సమస్య లను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువత ఓటు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : వచ్చే ఎన్నికల్లో యువత వినియోగించుకునే ఓటు రాష్ట్ర దశ దిశ మార్చేదిగా ఉండాలని టిడిపి అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏలేశ్వరంలో జరిగిన ఫస్ట్ ఓటు ఫర్ సిబిఎన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన అంతమొందించేందుకు టిడిపి, జనసేన కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు నియంతృత్వానికి, మానవత్వానికి మధ్య జరుగుతున్న పోరాటమని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, పెండ్ర శ్రీను, కోణాల వెంకటరమణ, యండగుండి నాగబాబు, నాయకులు సూతి బూరయ్య, బస్వా ప్రసాద్, చిక్కాల లక్ష్మణరావు ఉన్నారు. (కెకెడి 1-3- 2024, కెకెడి పిహెచ్ 23 :

అమరవీరుల త్యాగాలను జాతి మరవదు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మాదిగ అమరవీరుల త్యాగాలను జాతి ఎన్నటికీ మరువదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజు అన్నారు. స్థానిక పెద్దవీధిలో గల బాబుజగ్జీవన్ రావ్ విగ్రహం వద్ద శుక్రవారం ఎస్సీ వర్గీకరణ ఉద్యమాల్లో అశువులు బాసిన మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధించి అమరవీరుల ఆత్మ శాంతికి పోరాడతామన్నారు. సుప్రీంకోర్టులో కూడా ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అనుకూలంగా తీర్పు వస్తుందని యావత్ జాతి ఎదురుచూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు కాకాడ నాగేశ్వరరావు, మర్రివీడు మాజీ సర్పంచ్ గండేటి కిషోర్ కుమార్, సిరికోటి వీరబాబు, వేమగిరి ప్రేమానందం, కాకాడ చక్రవర్తి కార్యకర్తలు ఉన్నారు.

పల్స్ పోలీయో విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కాజులూరు : కాజులూరు మండల పరిధిలో ఈనెల మూడవ తేదీ ఆదివారం నిర్వహించనున్న జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని శిక్షణా కార్యక్రమంలో పాల్గొననున్న సిబ్బందికి గొల్లపాలెం పిహెచ్‌సి డాక్టర్ ఎస్. సౌజన్య కోరారు. ఈమేరకు సౌజన్య మాట్లాడుతూ గొల్లపాలెం, దుగ్గుదుర్రు పిహెచ్‌సిల పరిదిలో పల్స్ పోలియో విషయంలో తీసుకోనున్న జాగ్రత్తలు, పలు వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా సౌజన్య మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో 0 నుంచి 5.సం.లలోపు పిల్లలందరికీ మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు గొల్లపాలెం పీహెచ్సీ, దుగ్గుదుర్రు పీహెచ్సీల పరిధిలోని పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఆరోగ్య కేంద్రల సిబ్బంది, ఆశావర్కర్లలు, అంగన్వాడీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల సాంకేతిక ఆవిష్కరణలు "స్లైడ్స్ 2024" నిర్వహణ

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో "స్లైడ్స్ 2024"లో ఇఇఇ విభాగం వారి "ఎక్సల్ట్ 2024", మెకానికల్ విభాగం వారి "ఎరుడైట్ 2024", ఇసిఇ విభాగం వారి "ఎజైవ్ 2024", సిఎస్‌డి విభాగం వారి "ఇ 2024" విభాగాల వారు ది.01-03-2024వ తేదీన "స్లైడ్ 2024" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డా యంహెచ్‌యం కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్, యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ, (జెఎన్‌టియుకె) వారు విచ్చేశారని కళాశాల చైర్మన్ డాక్టర్ పి. కృష్ణారావు తెలియజేసారు. అనంతరం ముఖ్య అతిథి చేతి మీదుగా "స్లైడ్స్ 2024" సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పి. కృష్ణారావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఇటువంటి సాంకేతిక సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్యలో ప్రయోగాత్మక పరిజ్ఞానం విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందిచడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ డా కె సత్యనారాయణ తెలియజేసారు.